క్లుప్తంగా

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

వ్యాపారవేత్త వల్లభనేని భూషయ్య



ఉయ్యూరు: నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని వ్యాపారవేత్త వల్లభనేని నాగ భూషణరావు (భూషయ్య) కోరారు. ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామానికి చెందిన వల్లభనేని భూషయ్య శుక్రవారం నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన బోడె ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భూషయ్య మాట్లాడుతూ వివాదాలకు ఆస్కారం లేకుండా, అందరి సమన్వయంతో, సమష్టి కృషితో ప్రగతి కోసం పనిచేయాలని విజ్ఞప్తిచేశారు. ఉయ్యూరుకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పలువురు అధికారులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

తాడిగడపలో ఆలయ భూములకు కౌలు వేలం

పెనమలూరు: తాడిగడపలో ఆలయ భూముల కౌలు వేలం పాట నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.మోహన్‌రావు తెలిపారు. ఆయన శుక్రవారం ప్రకటనలో వివరాలు తెలుపుతూ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానానికి చెందిన 133 సర్వే నెంబర్‌లో 8.72 ఎకరాల వ్యవసాయ భూమి 2024 నుంచి 2027 అనగా మూడు సంవత్సరాలు సాగు కౌలు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. వేలం నెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో దేవదాయ, ధర్మాదాయ అధికారుల సమక్షంలో జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

అధికారం ఉన్నా.. లేకున్నా... జగనన్నతోనే



ఉయ్యూరు: అధికారం ఉన్నా...లేకున్నా...జగనన్నతోనే మా ప్రయాణం అంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గంటాపథంగా చెబుతున్నారు. కూటమి దాడులు లెక్కచేయకుండా మొక్కవోని ధైర్యంతో వైఎస్సార్‌ సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామాలు బాసటగా నిలుస్తున్నాయి. ఉయ్యూరు మండలంలోని కలవపాముల గ్రామంలో గెలిచినా...ఓడినా...నీ వెంటే ఉంటాం...గెలిస్తే నీ జెండా మోస్తాం...ఓడితే నిన్ను మా గుండెల్లో మోస్తాం అంటూ సర్పంచ్‌ పానుగుమాటి బాలస్వామి ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ అందరినీ ఆలోచింపచేస్తుంది.

వృద్ధుడు అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలో వృద్ధుడు అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపురంకాలనీ భువనేశ్వరి అపార్టుమెంట్‌కు చెందిన దాసరి బిజిలీకుమారి కుటుంబ సభ్యులతో ఉంటుంది. పమిడిముక్కల మండలం మామిళ్ల పల్లి గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వరరావు (70) గత మూడు నెలలుగా బిజిలీకుమారి ఇంట్లో ఉంటున్నాడు. అతను ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బిలిజీకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టెన్త్‌ క్లాస్‌కు పూర్తిస్థాయి ఇంగ్లీషు బోధన

విజయవాడరూరల్‌: ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు పూర్తిస్థాయి ఇంగ్లీషు విద్యాబోధన జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి ఎ.సూరిబాబు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు తెలుగులో విద్యాబోధన గత ఏడాదితో ముగిసిందన్నారు. ఈ ఏడాది పదవ తరగతి చదివే విద్యార్థులకు అన్ని సబ్జెక్టులూ ఇంగ్లీషులో స్టేట్‌ సిలబస్‌ ప్రకారం ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు. 2008వ సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి సక్సెస్‌ స్కూల్స్‌లో పదవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు (మీడియం)లో విద్యాబోధనను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అప్పటి నుంచి క్రమేపీ పదో తరగతి విద్యార్థులకు తప్పనిసరి ఇంగ్లీషులో విద్యాబోధనను ఈ ఏడాది నుంచి అమలు జరగబోతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల హైస్కూల్స్‌లో చదివే విద్యార్థులకు ఇది వర్తిస్తుందన్నారు.

రంజింప చేసిన హరికథ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై శుక్రవారం సాయంత్రం బీబీ నారాయణ భాగవతార్‌ బృందం ఆలపించిన హరికథ భక్తులను రంజింప చేసింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నారాయణ భాగవతార్‌ హరికథను ఆలపించగా, ఆయనకు హార్మనీ, మృదంగంపై పాడుగు ప్రభాకర్‌ చక్కటి సహకారం అందించారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం...వినోదం



శిక్షణ తరగతుల ముగింపులో పాల్గొన్న విద్యార్థులు



పురుషోత్తపట్నంలో సమ్మర్‌ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన అతిథులు

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం... వినోదం లభిస్తుందని వక్తలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గత నెల 15న చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, చెస్‌, క్యారమ్స్‌, క్రికెట్‌, నృత్యంలో శిక్షణ, ఆటల పోటీలు, కథల పోటీలు, భగవద్గీత శ్లోకాల పారాయణం వంటి పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. 2023–24 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ చాటిన మొదటి ఐదుగురు విద్యార్థులకు గ్రంథాలయంలో శుక్రవారం బహుమతులు అందించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్‌.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో విద్యార్థులతో గ్రంథ పఠనం, ఆటల పోటీలు వంటివి నిర్వహించి సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి రామకృష్ణ పర్యవేక్షించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెనమలూరు మండల పరిషత్‌ పరిపాలన అధికారి లోయ శివశంకర్‌రావు అన్నారు. పెనమలూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివశంకర్‌రావు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి కేంద్రాలన్నారు. ప్రతి విద్యార్థీ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలకు వెళ్లటం వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ కూడా పెరుగుతుందని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి శేషగిరిరావు మాట్లాడుతూ పాఠశాలలతో పాటు గ్రంథాలయాలు కూడా విద్యార్థులకు ఎంతో విజ్ఞానాన్ని సమకూర్చుతాయన్నారు. గ్రంథాలయాలలో అనేక పుస్తకాలు ఉంటాయని పుస్తక పఠనం చేయటం వలన విద్యార్థులకు మేలు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ రాజేష్‌, గ్రంథాలయ అధికారి హరిషా పాల్గొన్నారు. వణుకూరు శాఖ గ్రంథాలయంలో జరిగిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి భారతి, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ఉయ్యూరు: గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. శిక్షణకు హాజరై వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఐటీఐ కాలేజ్‌ ప్రిన్సిపాల్‌ ఎన్‌.సాంబశివరావు, ఏఎన్‌ఎం రాధిక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. నడిమింటి పైడియ్య అతని కుమార్తె శిరీష అల్పాహారం అందించారు. శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారని గ్రంథాలయాధికారి బి.రమణి తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

గన్నవరం రూరల్‌: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పంచే దేవాలయాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్‌ కె.కృపానందం అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమానికి సచివాలయం కార్యదర్శి జి.ఈశ్వర్‌ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్‌ క్యాంపులలో విద్యార్థులు పాల్గొని వారి సృజనను వెల్లడి చేయటమే కాకుండా, పుస్తక పఠనం, ఆటపాటలు, చెస్‌ వంటి మేధస్సును పెంచే ఆటల్లో ప్రతిభ చూపటం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను రోజూ సమ్మర్‌ క్యాంపుకు పంపటం ద్వారా వారిలో నూతన ఆవిష్కరణలకు నాంది పలికారని చెప్పారు. సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా తమ ప్రతిభను పెంచుకునేందుకు గ్రంథాలయాల్లో ఈ సమ్మర్‌ క్యాంపులు నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు. మే 15 నుంచి జరిగిన పోటీల్లో విజేతలను అభినందించి వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ రత్నకుమారి, డిజిటల్‌ అసిస్టెంట్‌ సాయి, మహిళా పోలీస్‌ జాగృతి, ఏఎన్‌ఎం, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో సమ్మర్‌ క్యాంపు ముగింపు కార్యక్రమం లైబ్రేరియన్‌ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యంలో జరిగింది. గ్రామపెద్దలు ఎం.శేషగిరిరావు, కె.రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులను సమ్మర్‌ క్యాంపుల్లో క్రమశిక్షణగా పేపర్‌లు చదివించటం, నీతి కథలు, డ్రాయింగ్‌, చెస్‌, యోగా చేయటం వంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



తెన్నేరు విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న గ్రంథాలయాధికారి సునీత

ఉంగుటూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని అందరూ సద్వినియోగించుకోవాలని ఎంఈవో–2 సాంబశివరావు అన్నారు. మండలంలోని జిల్లా శాఖా గ్రథాలయాల వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు సభలు శుక్రవారం నిర్వహించారు. ఉంగుటూరులో జరిగిన ముగింపు సభలో ఎంఈవో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్‌, శ్రీరాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. గత నెల 15వ తేదీ నుంచి జరుగుతున్న ఈ వేసవి విజ్ఞాన శిబిరానికి 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. వేసవి సెలవుల నేపథ్యంలో లైబ్రేరియన్‌ స్వర్ణ లతాదేవి, రిటైర్డ్‌ ఉద్యోగి ఎన్‌.బాబురావు నేతృత్వంలో విద్యార్థులకు కథలు చెప్పటం, వారితో కథలు చదివించటం, జనరల్‌ నాలెడ్జ్‌, నృత్యాలు, చెస్‌, క్యారమ్స్‌ వంటి ఇండోర్‌ గేమ్స్‌ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా చిన్నారులకు వివిధ ఆంశాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. పంచాయతీ కార్యదర్శి జి.శ్యామలరావు, గ్రామ సచివాలయం ఉద్యోగులు శివ నాగరాజు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ కోడెబోయిన బాబి చేతుల మీదగా విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.



కంకిపాడులో బహుమతులు అందిస్తున్న గ్రంథాలయాధికారి రామకృష్ణ



విద్యార్థికి సర్టిఫికెట్‌ అందచేస్తున్న ఏవో లోయ శివంకర్‌రావు, సచివాలయ సెక్రటరీ రాజేష్‌



ఉంగుటూరులో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో

పారిశుద్ధ్యం మెరుగుపర్చండి



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురు, కానూరు, పోరంకి, తాడిగడప సర్కిళ్లలో పారిశుద్ధ్యం మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కమిషనర్‌ ఎం. వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు కమిషనర్‌ శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. కమిషనర్‌ మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రిలు, పారిశుద్ధ్య కార్మికులు, పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం చూపరాదన్నారు. రోడ్లపై చెత్త కుప్పలు, వ్యర్థ పదార్థాలు ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. మురుగు కాలువలు పూడిక తీయించాలని పేర్కొన్నారు. రాబోయే వర్షాకాలంలో ప్రజలు ఎటువంటి అనారోగ్యానికి గురి కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గం ఎన్నిక

హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌: 2024–25 సంవత్సరానికి గానూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్‌ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్‌ మారుబోయిన కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. నూతన అధ్యక్షుడిగా విశ్రాంత అధ్యాపకుడు గూడపాటి జయరామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పాబోలు గణేష్‌బాబు, కోశాధికారిగా గంటా ఇందిరాదేవి ఎన్నికయ్యారని తెలిపారు. ఉపాధ్యక్షుడిగా దయాల ప్రభాకరరావు, సహాయ కార్యదర్శిగా బెజవాడ శ్రీరామ్మూర్తి, కార్యవర్గ సభ్యులుగా ఉడత కృష్ణ మోహన్‌, రేవిణిశెట్టి సూర్యనారాయణ, గోళ్ల మల్లికార్జునరావు, కళ్లేపల్లి నారాయణరావు ఎన్నికైనట్లు వివరించారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు.

తొలకరి తుళ్లింత



గోసాలలో సాగుకు అనువుగా దుక్కి దున్నిన మెట్ట పొలం



చెరువుగా మారిన కంకిపాడు బస్టాండు ప్రాంగణం

- తొలకరి ప్రభావంతో మారిన వాతావరణం
- మోస్తరు నుంచి కుండపోత వర్షం
- సాగు పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు

కంకిపాడు: తొలకరి పలకరించింది. రుతుపవనాల ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. శుక్రవారం పెనమలూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. ఇప్పటికే బోర్లు సదుపాయం ఉన్న రైతులు వేసవి దుక్కులను పూర్తి చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో లభించే వరి విత్తనాలను సేకరించి విత్తనశుద్ధి కూడా పూర్తి చేసుకున్నారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు, వాతావరణంలో తలెత్తిన మార్పులతో రైతులు పొలాల్లో ఉన్న పూర్వ పంట వ్యర్థాలు, గడ్డి తొలగించి నారుమడులు పోసుకునేందుకు సంసిద్ధం అవుతున్నారు. దమ్ము ట్రాక్టర్లతో దమ్ము చేయిస్తున్నారు. వరి విత్తనాలను చల్లి నారుమడులను సంరక్షించుకునే పనిలో పడ్డారు. వరి రైతులతో పాటుగా తొలకరి రాకతో మెట్ట రైతులు సైతం సాగుకు ఉపక్రమిస్తున్నారు. ప్రధానంగా ఈ నియోజకవర్గంలో పసుపు, కంద, కూరగాయలను సాగు చేసేందుకు భూములను దుక్కి దున్నేందుకు రెడీ అవుతున్నారు. పొలాలు అదును తప్పిపోకుండా సాగు సన్నాహాలు చేసుకుంటున్నారు. పసుపు సాగుకు అవసరమైన విత్తనాలను కడప, మైదుకూరు, ప్రగతి, శేలం, వంటి విత్తనాలతో పాటుగా సొంత విత్తనాలను కూడా నిల్వ ఉంచి అదును కోసం ఎదురుచూస్తున్నారు.

వర్షంతో అగచాట్లు....

వర్షంతో పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. రోడ్డు మార్జిన్‌లు, ప్రధాన సెంటర్లతో పాటుగా కంకిపాడు బస్టాండు సెంటరు తదితర పల్లపు ప్రదేశాల్లో వర్షంనీరు నిలిచిపోయి చెరువును తలపించాయి. ఈడుపుగల్లు, వేల్పూరు, గొడవర్రు, వణుకూరు లేఅవుట్‌లలో జగనన్న కాలనీలకు వెళ్లే మార్గాలు బురదమయంగా మారి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ): మహిళను వేదింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట బ్రహ్మంగారి మఠం ప్రాంతానికి చెందిన బోయినపల్లి అన్నపూర్ణ, లింగం వెంకటేశ్వరరావు భార్యభర్తలు. అయితే కొంత కాలం కిందట భార్యాభర్తలకు విభేదాల కారణంగా వేరువేరుగా ఉంటున్నారు. అన్నపూర్ణ రెండేళ్ల కిందట గోపికృష్ణతో సహజీవనం సాగిస్తుండగా, అతనితోనూ విభేదాలు వచ్చాయి. దీంతో గోపికృష్ణను అన్నపూర్ణ దూరంగా ఉండటంతో వేదింపులకు గురి చేయడంతో పాటు చంపుతానని బెదిరింపులకు పాల్పడసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆర్‌ఆర్‌పేట ఎల్‌సీ గేట్‌ తాత్కాలికంగా మూసివేత

రైల్వేస్టేషన్‌(విజయవాడపశ్చిమ): ఎల్‌సీ గేట్‌ ఓవర్‌ హాలింగ్‌, స్లీపర్‌ల నిర్వహణ పనుల కారణంగా విజయవాడ రైల్వే స్టేషన్‌ సమీపంలోని రాజరాజేశ్వరిపేట ఎల్‌సీ గేట్‌ను మూడు రోజుల పాటు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు విజయవాడ డివిజన్‌ సీనియర్‌ సెక్షన్‌ ఇంజినీర్‌ శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు. బల్బ్‌ లైన్‌లోని వీఎస్‌సీ క్యాబిన్‌–బల్బ్‌ క్యాబిన్‌ మధ్యలో ఉన్న ఈ గేటును ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఆ మార్గం నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాల్సిందిగా ఆయన కోరారు.

దౌర్జన్యం చేసిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: తాడిగడపలో ఓ విలేఖరిపై దౌర్జన్యం చేసిన వ్యక్తుల పై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల మేరకు... తెలుపుతూ తాడిగడప గ్రీన్‌ సిటీలో ఆంధ్రప్రభ విలేఖరి అన్నాబత్తుల శ్రీనివాసరావు ఉంటున్నాడు. గ్రీన్‌సిటీకాలనీలో గతంలో శ్రీనివాసరావుకు కె.నాంచారయ్య అనే వ్యక్తితో వివాదం ఉంది. కాగా ఈ నెల 5వ తేదీ రాత్రి నాంచారయ్య, ధనేకుల రాజేష్‌, పి.ప్రభాకర్‌, రమణ, రాంబాబులు మారణాయుధాలతో విలేఖరి శ్రీనివాసరావు ఇంటి వద్దకు అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యం చేసి జేసీబీతో ఇంటిని పడవేస్తామని దూషించి బెదిరించారని విలేఖరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూగజీవుల పట్ల ప్రేమ, కరుణ చూపాలి

ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవులతో పాటు మూగజీవాలైన జంతువులపట్లకూడా ప్రేమాభిమానాలు, కరుణ చూపాలని ఆధ్యాత్మిక, సామాజికవేత్త, లయన్స్‌ జిల్లా అంబాసిడర్‌ వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ విజయవాడ ఆధ్వర్యంలో హజరత్తయ్య గుప్తా, ఐ. నాగేశ్వరరావు భవానీపురంలోని జీవకారుణ్య సంస్థలోని మూగజీవులకు బియ్యం బస్తాలు, కుక్కలు తినే బిస్కెట్‌ ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ మూగజీవులపట్ల కరుణతోకూడిన జీవితం గడపటం ద్వారానే భగవంతుని కృపాకటాక్షలను పొందటం సాధ్యమవుతుందన్నారు. క్లబ్‌ అధ్యక్షుడు కె. రామలింగేశ్వరరావు, కోశాధికారి కె. రామకృష్ణ, కొత్తమాసు రాంకుమార్‌ పర్యవేక్షణలో జరిగిన డాక్టర్‌ మురాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



జీవకారుణ్య సంస్థలోని మూగజీవాలకు బియ్యం, బిస్కెట్‌లు అందజేస్తున్న హజరత్తయ్య గుప్తా

దేవస్థానం భూములకు కౌలు వేలం



నున్న(విజయవాడరూరల్‌): నున్న గ్రామంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంకు చెందిన వ్యవసాయ భూములకు దేవదాయశాఖ అధికారులు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కౌలువేలం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ నెంబర్లు 607/2,574/2లో ఆలయానికి సంబంధించి ఎకరం 30 సెంట్లు వ్యవసాయ భూమికి 2024–27వ సంవత్సరం వరకు అనగా మూడు సంవత్సరాలకు గాను కౌలు వేలం నిర్వహించారు. 8 మంది రైతులు కౌలువేలం లో పాల్గొనగా అంగజాల రాంబాబు అనే రైతు సంవత్సరానికి రూ.26 వేలు కౌలు చెల్లించే విధంగా హెచ్చు వేలం పాడగా అధికారులు ఆయనకు కౌలు వేలం ఖాయం చేశారు. అనంతరం కౌలు దారుడు ఒక ఏడాది కౌలు అనగా 26 వేలు చెల్లించాడు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్‌.అరుణ, పర్యవేక్షణ అధికారి కంచర్ల సురేష్‌, దేవస్థానం అర్చకులు డాక్టర్‌ మామిళ్ళపల్లి ఫణికుమార్‌, గుమస్తా సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయానికి స్టీల్‌ టేబుల్స్‌ వితరణ



రామవరప్పాడు: విజయవాడరూరల్‌ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయానికి శుక్రవారం ఆలయ చైర్మన్‌ బోయిన భాను ప్రదీప్‌ స్టీల్‌ టేబుల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ ఆలయంలో అమ్మవారి ప్రసాదం భక్తులకు అందించే సౌకర్యార్థం వీటిని అందజేసినట్లు తెలిపారు. పండుగ పర్వదినాలు, ప్రత్యేక సందర్భాల్లో అధిక సంఖ్యలో హాజరయ్యే భక్తులకు ప్రసాదం అందించే నిమిత్తం పాత్రలు పెట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఈ టేబుల్స్‌ అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

తాపీతో ఆటోడ్రైవర్‌పై దాడి

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ): ఇంటి దగ్గర పిల్లలు క్రికెట్‌ ఆడుకునే విషయంలో చోటు చేసుకున్న వివాదంలో ఆటోడ్రైవర్‌పై తాపీతో దాడి చేసి గాయపరిచిన ఘటన కొత్తపేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

10న కోదండరామయ్య విగ్రహావిష్కరణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌, ప్రిన్సిపాల్‌

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్‌ కళాశాలలో ఈ నెల 10వ తేదీన వేములపల్లి కోదండరామయ్య 110వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు కళాశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌ వెంకట్‌ మోటపర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్‌ మాట్లాడారు. ఈ ప్రాంత విద్యాభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని 1969లో వీకేఆర్‌ కళాశాలను బుద్దవరంలో కోదండరామయ్య స్థాపించినట్లు తెలిపారు. ఈ కళాశాలలో చదువుకున్న వేలాది మంది దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. విమానాశ్రయ విస్తరణ వల్ల ఉనికిని కోల్పోతున్న కళాశాలను కేసరపల్లిలో ఏర్పాటు చేయడం వల్ల పూర్వ వైభవాన్ని సంతరించుకుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యప్రదాత కోదండరామయ్య విగ్రహాన్ని నూతన క్యాంపస్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యార్లగడ్డను కలిసిన పోలీస్‌ అధికారులు



గన్నవరం: శాసనసభ్యునిగా ఎన్నికైన యార్లగడ్డ వెంకట్రావును శుక్రవారం గన్నవరం సబ్‌ డివిజన్‌ పోలీస్‌ అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. డీఎస్పీ జయసూర్య నేతృత్వంలో గన్నవరం, హనుమాన్‌జంక్షన్‌ సర్కిల్‌ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సీఐలు వరప్రసాద్‌, నవీన్‌నరసింహమూర్తి, పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అల్గారిథమ్స్‌పై పట్టు సాధించాలి



డాక్టర్‌ బాబురెడ్డి

పన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): కంప్యూటర్స్‌ రంగ విద్యార్థులు అల్గారిథమ్స్‌పై పట్టు సాధించినప్పుడు మంచి అవకాశాలను పొందుతారని కృష్ణా విశ్వవిద్యాలయం కంప్యూటర్స్‌ విభాగ ఆచార్యులు డాక్టర్‌ ఎం. బాబురెడ్డి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ అప్లికేషన్స్‌ విభాగం ఆధ్వర్యంలో 'డిజైన్‌ ఆఫ్‌ ఎఫిషియంట్‌ అల్గారిథమ్స్‌' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్‌ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్‌ ఎం. బాబురెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్స్‌ విభాగంలో అల్గారిథమ్స్‌ చాలా ముఖ్యమైన అంశమన్నారు. కంప్యూటర్స్‌లో పట్టు సాధించాలంటే అల్గారిథమ్స్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ అంశంపై లోతైన విశ్లేషణ చేయగలిగినప్పుడు ఈ రంగంలో మంచి పట్టును సాధించగలరన్నారు. ముఖ్యంగా కంప్యూటర్స్‌ రంగ విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ వాటిపై పట్టు సాధించాలని సూచించారు. ఈ విధమైన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులను తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైస్‌ ప్రిన్సిపాల్స్‌ పీఎల్‌ రమేష, ఎం. వెంకటేశ్వరరావు, విభాగాధిపతి పి. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.